ఈనాడు
నిజామాబాద్
బుధవారం అక్టోబరు 9, 2024

ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తొద్దు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలని, రైతులకు నష్టం కలగజేస్తే చర్యలు ఉంటాయని పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. తూకం, తరుగు విషయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. దొడ్డు, సన్న రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో 150 కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. సమావేశంలో తాహెర్, డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, డీఎస్‌వో అర్వింద్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్, డీసీవో శ్రీనివాస్, డీఏవో వాజీద్ హుస్సేన్, సహకార సంఘాల సీఈవోలు, రైస్ మిల్లర్లు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.



చేప పిల్లల్ని చెరువులోకి వదులుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు

నాణ్యమైన చేపల పెంపకానికి చర్యలు


ఎడపల్లి, న్యూస్‌టుడే : మత్స్యకారులు నాణ్యమైన చేపలు పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి జానకంపేట అశోక్‌సాగర్ చెరువులో మంగళవారం చేప పిల్లలు విడుదల చేశారు. వాటి నాణ్యతతో పాటు తూకం వేసి బరువు పరిశీలించారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వందశాతం రాయితీపై నాణ్యమైన చేప పిల్లలు అందిస్తున్నట్లు చెప్పారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయస్వామి పాల్గొన్నారు.



నగదుతో వైభవం.. లక్ష్మీదేవిగా దర్శనం

నందిపేట్ మండల కేంద్రం పాతూర్‌లో ఓంకార రూపిణీ దుర్గామాత అమ్మవారు మంగళవారం లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కాలనీవాసులు రూ. 500, 200, 100, 50 నోట్ల కట్టలతో అలంకరించారు. ఇందుకు రూ.1.61 కోట్ల నగదు ఉపయోగించారు. **- న్యూస్‌టుడే, నందిపేట్**

కాత్యాయినికి స్వర్ణ శోభ



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. జిల్లా కేంద్రం కిషన్‌గంజ్ వాసవి కన్యకాపరమేశ్వరిని మంగళవారం కాత్యాయినిగా అలంకరించారు. ఆరు కిలోల బంగారు ఆభరణాలతో అలంకరించడంతో స్వర్ణకాంతులు విరజిమ్మాయి. **- న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం**

465 మందికే నియామక పత్రాలు

- 136 పోస్టులపై వీడని ఉత్కంఠ
- నేడు హైదరాబాద్‌కు ఎంపికైన అభ్యర్థులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం


త్వరలో ప్రభుత్వ బడుల్లో నూతనోపాధ్యాయులు చేరనున్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో 601 ఖాళీల భర్తీకి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఫలితాలు ప్రకటించింది. ధ్రువపత్రాల తిరస్కరణ, రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు తదితర కారణాలతో 136 పోస్టులను హోల్డ్‌లో పెట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం నియామకపత్రాలు అందించేందుకు 465 మందిని ఎంపిక చేశారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి అభ్యర్థులను పంపేందుకు విద్యాశాఖ 11 బస్సులు ఏర్పాటు చేసింది. ఎంఈవోలకు ఈ బాధ్యతలు అప్పగించారు. నిజామాబాద్ పాత కలెక్టర్ మైదానం నుంచి ప్రత్యేక బస్సులు ఉదయం బయలుదేరుతాయని అధికారులు వెల్లడించారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

జిల్లాలో మొత్తం 601 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించారు. కానీ, షెడ్యూల్ హడావుడి కారణంగా ప్రక్రియ పూర్తిస్థాయిలో నిర్వహించనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 465 మందికి పిలుపురావడంతో మిగిలిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. 136 పోస్టుల్లో తమకు చోటు దక్కుతుందా? అసలు వాటిని ఇదే మెరిట్ జాబితాతో పూర్తి చేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వెబ్ ఆప్షన్ విధానంలో..

ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి నియామకపత్రాలు అందిస్తారు. త్వరలోనే వెబ్ ఆప్షన్లు ఇచ్చి పాఠశాలలు ఎంచుకునే అవకాశం కల్పిస్తారని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.



తదుపరి ఆదేశాల మేరకు చర్యలు

1:1 మెరిట్ జాబితాలు రాష్ట్రస్థాయిలోనే సిద్ధం చేశారు. మిగిలిన పోస్టులకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. **- దుర్గాప్రసాద్, డీఈవో**

కేటగిరీ, మాధ్యమాల వారీగా ఎంపికైన అభ్యర్థులు

విభాగం	తెలుగు	హిందీ	ఉర్దూ	ఆంగ్లం
ఎస్ఏ(జీవశాస్త్రం)	18	–	1	–
ఎస్ఏ(ఆంగ్లం)	–	–	–	7
ఎస్ఏ(హిందీ)	–	9	–	–
ఎస్ఏ(గణితం)	16	–	1	–
ఎస్ఏ(భౌతిక)	5	–	–	–
ఎస్ఏ(వ్యాయామ)	3	–	–	–
ఎస్ఏ(సాంఘిక)	36	–	3	–
ఎస్ఏ(తెలుగు)	10	–	–	–
ఎస్ఏ(ఉర్దూ)	–	–	2	–
ఎస్ఏ (ప్రత్యేక కేటగిరీ)	9	–	–	–
ఎస్జీటీ	277	1	38	3
భాషా పండితులు	10	4	3	–
పీఈటీ	5	–	2	1

1250 మంది ధ్రువపత్రాల పరిశీలన

ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, ఫలితాలు సెప్టెంబరు 30న ప్రకటించారు. అన్ని విభాగాల్లో 1:3 నిష్పత్తిలో 1321 మంది అభ్యర్థుల్ని ధ్రువపత్రాల పరిశీలనకు ఆహ్వానించగా 1250 మంది హాజరయ్యారు. 1:1 జాబితాలు సోమవారమే ప్రకటించాల్సి ఉన్నా సాంకేతిక కారణాలతో మంగళవారం సాయంత్రం ప్రకటించి, ఎంపికైన అభ్యర్థులకు చరవాణిలో బుధవారం ఉదయం 6 గంటల వరకు పాత కలెక్టర్ మైదానానికి రావాలని సమాచారం అందించారు. డీఈవో మెరిట్ జాబితాలు రాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టారు.



మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు పీవీ వావా, చిత్రంలో జిల్లా అధికారులు

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా ప్రజల శ్రేయస్సు కోసం పని చేసే పారిశుద్ధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డా. పీవీ వావా తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టర్ కార్యాలయంలో పాలనాధికారి రాహుల్ గాంధీ హన్మంతుతో కలిసి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్మికుల పునరావాసానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్, అదనపు పాలనాధికారి అంకిత్, కమిషనర్ మకరందు, కేంద్ర సామాజిక న్యాయవిభాగం సభ్యుడు గిరేందర్ నాథ్, సమన్వయకర్త చరణ్ పాల్గొన్నారు.

నెట్టింట.. ఇందూరు బతుకమ్మ
★ ఓటరు జాబితాలో మీ పేరుందా..? .. 12లో

చెత్త సమస్యకు చెక్

- బయోమైనింగ్‌తో ప్రక్రియ ప్రారంభం
- మూడు నెలల్లో 2,200 మెట్రిక్ టన్నులు శుద్ధి

నగరపాలక సంస్థలో నిత్యం 200 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీనిని డంపింగ్ చేయాలంటే వందల ఎకరాలు అవసరం. ఆ స్థాయిలో స్థల సేకరణ సవాలుగా మారింది. ఈ 30 ఏళ్లలో నిల్వ కోసం పది చోట్లు మారాల్సి వచ్చింది. గుట్టలు గుట్టలుగా పేరుకుపోతుండటంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఇందుకు నిజామాబాద్ కార్పొరేషన్ శాశ్వత పరిష్కారం కనుగొంది. బయోమైనింగ్‌తో చెత్త శుద్ధీకరణ ప్రారంభించింది. క్యూబ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో మూడు నెలల్లో 2200 మె.ట. చెత్త శుద్ధి చేసింది. తరచూ డంపింగ్ యార్డులు మార్చే బాధ ఇక తప్పంది.

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

మొదట డంపింగ్ యార్డ్ న్యాల్కల్ రోడ్డులోని రేడియో స్టేషన్ వద్ద ఉండేది. ఇక్కడ జనావాసాలు రావడంతో ఖిల్లా రోడ్డుకు మార్చారు. అక్కడ పొగ వ్యాపించడంతో స్థానికులు అడ్డుకున్నారు. తర్వాత నాగారం డైట్ కళాశాల వద్దకు. . అక్కడా వ్యతిరేకత రావడంతో రోడ్ల పక్కన ఖాళీ స్థలాల్లో వేసేవారు. తర్వాత నాగారం 300 క్వార్టర్స్‌కు వెనకాల 51 ఎకరాలు కేటాయించారు. పదేళ్లుగా అక్కడ చెత్త వేస్తుండటంతో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. నిప్పు పెడుతుండటంతో పొగ, దుర్వాసన నివాసాలవైపు వస్తోంది. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉండటంతో బయోమైనింగ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



చెత్తను శుద్ధి చేస్తున్న యంత్రాలు



వచ్చే జులై వరకు...

జులైలో శుద్ధి ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే జులై 2025 నాటికి 4.80 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. **- వేణుమాధవ్, ప్రాజెక్టు మేనేజర్, క్యూబ్ ప్రైవేటు లిమిటెడ్**

స్వచ్ఛ భారత్ మిషన్ 2.0

స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా పురపాలికల్లో జీరో డంపింగ్ స్థలాలుగా మార్చే లక్ష్యంగా బయో మైనింగ్ విధానం అవలంబిస్తున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కాంపోనెంట్ కింద వీటికి నిధులు సమకూర్చారు. బయోమైనింగ్ కోసం టెండర్ నిర్వహించి ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. జులైలో నాగారం డంపింగ్ యార్డులో ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో చెత్తను ఒకచోటకు చేర్చి రసాయనాలు చల్లి వేరు చేసే యంత్రంలో వేస్తారు. కంపోస్టును ఒకవైపు, రాళ్లను మరోవైపు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇంకో వైపు పంపిస్తుంది. వేరు చేసిన రాళ్లు, మట్టితో గుంతలు పూడుస్తారు. కంపోస్టును నగరంలో సుందరీకరణ పనులకు, ప్లాస్టిక్ వ్యర్థాలు సిమెంటు ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ఈ ప్రక్రియ నిర్వహణకు ప్రభుత్వం టన్నుకు రూ. 550 చొప్పున ఏజెన్సీలకు చెల్లిస్తోంది.

దరఖాస్తు ఫారం పేరుతో దందా

నిజామాబాద్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డును తెరపైకి తెచ్చింది. ఈ నెల 3 నుంచి 7 వరకు ఎంపిక చేసిన గ్రామాలు, డివిజన్, వార్డుల్లో ప్రయోగాత్మకంగా సర్వే చేశారు. దీనికి సంబంధించి దరఖాస్తు ఫారం ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇందులో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని, ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేనివారు, కార్డుంటే సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలని దళారులు ప్రచారం చేస్తున్నారు. నిజామాబాద్ దక్షిణ మండల తహసీల్దార్ బాల్‌రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వదంతులు నమ్మొద్దని, ఎలాంటి దరఖాస్తు ఫారం విడుదల చేయలేదన్నారు.

ముఖాముఖి మళ్లీ నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ డివిజన్‌లో రేషన్ డీలర్ల భర్తీలో అనుమానాలు ఉన్నాయని, తిరిగి ముఖాముఖి నిర్వహించాలని కలెక్టర్, ఆర్డీవోకు మంగళవారం అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. రాత పరీక్షలో మార్కులు రాని వారికి పోస్టులిచ్చారని, ప్రత్యేకాధికారితో విచారణ జరిపించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : సీపీ

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: దసరా పండుగ సెలవులకు ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సీపీ కల్మేశ్వర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, ఇతర వస్తువులు అమ్ముకునేవారిపై నిఘా పెట్టాలని పేర్కొన్నారు. రాత్రుళ్లు అనుమానంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్లేవారు ఇంటిచుట్టుపక్కల వారితో పాటు స్థానిక పోలీసు ఠాణాకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

త్వరలో తెవివికి కొత్త ఉపకులపతి

పరిశీలనలో ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడి పేరు

ఈనాడు, నిజామాబాద్

తెలంగాణ విశ్వవిద్యాలయానికి త్వరలో కొత్త ఉపకులపతి రానున్నారు. రాష్ట్రంలో పది వర్సిటీల వీసీల ఎంపిక కోసం సెర్చ్ కమిటీల నియామకం కాగా.. ఏడు వర్సిటీల కమిటీల సమావేశాలు ఇది వరకే పూర్తయ్యాయి. రెండు వర్సిటీల సమావేశాలు రద్దవ్వగా.. తాజాగా మంగళవారం తెవివికి సంబంధించి భేటీ జరిగింది. కమిటీలో ప్రభుత్వ నామినీగా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వర్సిటీ ఈసీ నామినీగా ఓయూ పూర్వ వీసీ సులేమాన్ సిద్ధిఖీ, యూజీసీ నామినీగా హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ వర్సిటీ వీసీ హాజరయ్యారు. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హతల ఆధారంగా మూడు పేర్లు ఎంపిక చేశారు. ఈ వివరాలు ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి దస్త్రం గవర్నర్‌కు పంపి, చివరకు ఒకరిని ఎంపిక చేసి ఆమోద ముద్ర వేశాక అధికారికంగా వెల్లడించనున్నారు. దసరా లోపే ప్రక్రియ పూర్తికి కసరత్తు చేస్తున్నారు.

దాదాపు ఖరారు..

తెవివి ఉపకులపతి పదవి కోసం 135 దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో ఇతర వర్సిటీలకు దరఖాస్తు చేసుకున్న జాబితాలో ఒకరి పేరును కమిటీ ఎంపిక చేసినట్లు సమాచారం. సదరు ఆచార్యుడు ఓయూ న్యాయవిద్య విభాగంలో పని చేస్తున్నారు. దాదాపు ఆ పేరు ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారమవుతోంది.

ఇన్నాళ్లు ఇన్‌ఛార్జుల పాలనలో..

తెవివి పరిస్థితి వేరు. గతేడాది ఏప్రిల్‌లో పాలకమండలి, అప్పటి వీసీ రవీందర్ గుప్తా మధ్య విభేదాలు తలెత్తాయి. ఇష్టానుసారం నిర్ణయాలు ఉంటున్నాయని సభ్యులు ఉన్నతాధికారుల చెప్పడంతో వీసీ అధికారాలకు కోత పెట్టారు. ఏ నిర్ణయమైన విద్యాశాఖ కార్యదర్శి అనుమతితోనే అమలు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో గతేడాది జూన్‌లో వీసీ ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం నుంచి లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కడంతో ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించింది. ఆ తర్వాత ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఇన్‌ఛార్జి వీసీలుగా కొనసాగారు. వీరికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి చాలా పనులు అపరిష్కృతంగా ఉండిపోయాయి. పూర్తిస్థాయి ఉపకులపతి వస్తేగానీ ఇక్కడి సమస్యలకు పరిష్కారం లభించని పరిస్థితి.

ఒకే ఒక్కడు

నిజామాబాద్ రైల్వే ఠాణా పరిధిలో 36 స్టేషన్లు

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ, డిచ్‌పల్లి గ్రామీణం

నిజామాబాద్ రైల్వే ఠాణా పరిధి 400 కిలో మీటర్లు. మొత్తం 36 రైల్వే స్టేషన్లు. దొంగతనాలు, హత్యలు, ఆత్మహత్యలు, రైల్లో నుంచి పడి మృతి చెందడం, గంజాయి అక్రమ రవాణా తదితర ఘటనలు నిత్యకృత్యం. ఇంత విస్తీర్ణంలో నేరాల అదుపు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, పర్యవేక్షణ చూసేందుకు ఒకే ఎస్‌హెచ్‌వో ఉన్నారు. కేసుల ఛేదన తలకు మించిన భారమవుతోంది.

నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధి దక్షిణాన మెదక్ జిల్లా మనోహరాబాద్, ఉత్తరాన నిర్మల్ జిల్లా బాసర, ఆదిలాబాద్, పడమర బోధన్ మొదలుకొని.. తూర్పున జగిత్యాల వరకు విస్తరించి ఉంది. రైల్వే స్టేషన్ల పరిధిలో ఎక్కడ కేసైనా నిజామాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలోనే ఎఫ్ఆర్ నమోదువుతుంది. గత ఏడాది కాలంలో 171 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నిజామాబాద్ రైల్వే ఠాణాలో ఎస్‌హెచ్‌వోతో పాటు నలుగురు మహిళా, 8 మంది పురుష కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు. కామారెడ్డి, ఆదిలాబాద్, బాసరలో పోలీసు ఔట్‌పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఒక్కోచోట ముగ్గురు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. ఆయా చోట్లా చిన్నచిన్న కేసులుంటే సిబ్బంది చూసుకుంటారు. ఆత్మహత్యలు, హత్యలు, ఇతర పెద్ద ఘటనలు జరిగితే ఎస్‌హెచ్‌వో వెళ్లాల్సిందే. పనిభారం పెరిగి కేసుల ఛేదన గగనంగా మారింది. ఇటీవల నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, మెదక్ జిల్లా గజ్వేల్‌లో కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పడ్డాయి. వీటి పరిధిలో కొత్త రైల్వే ఠాణాలు నెలకొల్పితే నిజామాబాద్ ఠాణాపై ఒత్తిడి తగ్గనుంది.

గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసుల తీరు

దొంగతనాలు	: 55
ప్రమాదవశాత్తు మరణాలు	: 35
ఆత్మహత్యలు	: 32
రైల్లో సహజ మరణాలు	: 24
ఇతర కేసులు	: 25



ఎస్‌హెచ్‌వో సాయిరెడ్డి

నెట్టింట.. ఇందూరు బతుకమ్మ

● ప్రత్యేకత చాటుకుంటున్న ఇందూరు యువత

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నేటి యువత ఆలోచన తీరు మారింది. సంప్రదాయానికి సాంకేతికతను జోడిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ విశ్వవ్యాప్తం చేస్తున్నారు. బతుకమ్మ వేడుకల వీడియోలు, చిత్రాలను ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నారు. కొందరు పండగ విశిష్టతలపై లఘు చిత్రాలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటే, మరికొందరు రీల్స్ చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు పల్లె సంప్రదాయానికి పట్టం కడుతున్నారు. వీరి కృషికి దేశ, విదేశాల నెటిజన్ల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి.

ఇన్‌స్టాలో వేడుకలు

- వసంత, కసాబ్‌గల్లీ, నిజామాబాద్

నాలుగైదేళ్లుగా బతుకమ్మతో సెల్ఫీలు దిగి దాచుకున్నా. రెండేళ్లుగా వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌లో షేర్ చేస్తున్నా. ప్రశంసలు వస్తుండటంతో స్నేహితురాళ్లు అక్షిత, భవ్యశ్రీ, శైలజ, పూజిత, జాగృతి, ఉజ్జయినితో కలిసి బతుకమ్మ ఆడి వీడియోలు పోస్ట్ చేస్తున్నా. చాలా మంది ఇతర ప్రాంతాల వారు స్నేహితులయ్యారు. హైదరాబాద్, దిల్లీ, చెన్నై నగరాల నుంచే కాకుండా దుబాయి, అమెరికా, లండన్ తదితర ప్రాంతాల్లోని తెలుగువారు లైక్‌లు కొట్టి అభినందిస్తున్నారు. అక్కడ జరిగే వివిధ పండగల చిత్రాలు, వీడియోలు నాకు పంపిస్తున్నారు. బతుకమ్మతో మాకు కొత్త మిత్రులు దొరికారు.





రీల్స్ చేస్తున్నాం

- వర్ష, డిగ్రీ విద్యార్థిని, న్యాల్‌కల్‌రోడ్డు, నిజామాబాద్

గతంలో సినిమా, జానపద గీతాలపై రీల్స్ చేసేవాళ్లం. ఈ ఏడాది నుంచి నా మిత్రులు రోహిత, తోజోమయి, వందనతో కలిసి బతుకమ్మపై వీడియోలు చేస్తున్నాం. మన ఆచార వ్యవహారాలు నేటి యువతకు అందించేందుకు ఆసక్తికరమైన రీల్స్ చేస్తున్నాం. బతుకమ్మ పాటల విశిష్టతను సొంతంగా ఎడిట్ చేసి రీల్స్ రూపొందిస్తున్నాం. ఈ నెల 3న గిరిరాజ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలను చిత్రీకరించి ఇన్‌స్టాలో జీజీసీ.ఎన్‌జెడ్‌బీ పేరుతో షేర్ చేశాం. వందల్లో లైక్‌లు వచ్చాయి. పూర్వవిద్యార్థులూ స్పందించి అభినందించారు.

యూట్యూబ్‌లో లఘుచిత్రాలు

- రమ్య ఆనంద్, బోధన్

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చడం, లయబద్ధంగా వలయాకారంలో తిరుగుతూ బతుకమ్మ ఆడటం చూడముచ్చటగా ఉంటుంది. గ్రామీణ మహిళలు బతుకమ్మ పాటలను అలవోకగా పాడేస్తుంటారు. స్వచ్ఛమైన పల్లెసంస్కృతి కాపాడుతున్న మహిళలను సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం చేయాలని భావించి మల్టీమీడియా కోర్సు నేర్చుకున్నా. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో లఘు చిత్రాలు తీస్తున్నా. ఇటీవల బతుకమ్మ పేరుతో యూట్యూబ్‌లో పెట్టిన లఘు చిత్రానికి మంచి పేరొచ్చింది. పల్లె సంస్కృతిని ప్రతిబింబించే మరిన్ని వీడియోలు తీస్తా.



పోటీలు నిర్వహిస్తున్నా..

- సుంకరి కార్తిక్, చిత్రపురి ఫిల్మ్ వ్యవస్థాపకుడు, నిజామాబాద్

బీటెక్ తర్వాత పుణెలో ఫిల్మ్ మేకింగ్‌పై కోర్సు చేశా. ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు వద్ద పలు చిత్రాలకు పనిచేశాను. బతుకమ్మపై ఇప్పటి వరకు 10 లఘుచిత్రాలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తే వేలల్లో లైక్‌లు వచ్చాయి. యువతను ప్రోత్సహించేందుకు చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్నా. ఉత్తమంగా నిలిచిన వాటికి బహుమతులు ఇస్తున్నాం. గ్రామీణ సంస్కృతిని కాపాడుకోవాలి.



ఓటరు జాబితాలో మీ పేరుందా..?

● ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. కానీ చాలా మంది అక్కడికి వెళ్లి ఓటరు జాబితా సరిచూసుకోవడానికి సమయం కేటాయించరు. అయితే ఇప్పుడు ఓటరు జాబితాలో మీ పేరు ఉంది లేనిది అరచేతిలో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ పేరు ఓటరు జాబితాలో ఉంది లేనిది ఇట్టే చూసుకోవచ్చు.

● ముందుగా గూగుల్‌లోకి వెళ్లి tsec.gov.in అని టైప్ చేయగానే తెలంగాణ ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. అందులో ఫైనల్ రోల్స్ జీపీ/వార్డు వైజ్ ఓటరు లిస్ట్ యాజ్ ఆన్ 28.09.2024 అనే ఐచ్ఛికం కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయాలనే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత సదరు పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. అందులో వార్డుల వివరాలు కూడా ఉంటాయి. మనం నివసించే వార్డుకు సంబంధించిన బాక్సును క్లిక్ చేస్తే మన వివరాలు మొత్తం కనిపిస్తాయి.



జిల్లా, మండలం, గ్రామం వివరాలు చూపించే పేజీ

పీఆర్టీయూ రాష్ట్రశాఖలో చోటు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి అర్బన్ పీఆర్టీయూ శాఖ నుంచి రాష్ట్ర కార్యవర్గంలో పలువురికి చోటుదక్కింది. రాష్ట్ర సహ అధ్యక్షులుగా పోచయ్య, మాణిక్యం, గోవర్ధన్, రమేశ్, అశోక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుంధతి, ఉపాధ్యక్షుడిగా మధుకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎన్నికైన వారు పేర్కొన్నారు.

‘రైతు భరోసా ఎక్కడ?’

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి రైతు భరోసా నగదును వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ అన్నారు. కామారెడ్డి జిల్లాకేంద్రంలో మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరానికి రూ.7500 రైతు భరోసా కల్పించాలన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, ప్రతినిధులు నర్సింలు, అరుణ్, రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ

దిష్టిబొమ్మల్.. అటవీ జంతువులు హడల్



పంటలు కోతకొచ్చాయి. ఈ రెండు నెలలు రైతులకు కీలకమైన సమయం. అడవి పందులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు స్పీకర్లతో శబ్దాలు చేస్తుంటే మరికొందరు దిష్టిబొమ్మలు పెడుతున్నారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ఎల్లమ్మకుంట నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి మార్గంలో వ్యవసాయ పొలాల్లో విభిన్న రూపాల్లో దిష్టిబొమ్మలు ఏర్పాటు చేయడంతో అటవీ జంతువులు పరారవుతున్నాయి. – ఈనాడు, నిజామాబాద్

సగం దారి పార్కింగ్‌కే..



ఈ చిత్రం కామారెడ్డి కలెక్టరేట్‌లోనిది. ఇక్కడ పార్కింగ్ సౌకర్యం లేక ఉద్యోగులు, ప్రజలు ఇలా రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. పార్కింగ్ షెడ్డు కోసం గత ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన చేసినా.. ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. సగం రోడ్డు వాహనాలు నిలిపేందుకుకే సరిపోతుండటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. – న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

వ్యాపారం.. వినూత్నం



విభిన్నంగా వ్యాపారం చేస్తున్నారు మాక్లూర్ మండలం చిక్లీకి చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తి. ఆయన ఇది వరకే పలు వ్యాపారాలు చేశారు. స్వతహాగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తారు. ఒకే చోట, ఒకే తరహా వ్యాపారం చేయడం బాగా లేదని గ్రహించి తనకున్న ద్విచక్ర వాహనాన్ని వ్యాపారానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. కోకా ఆకారంలో ఉండే రేకుల డబ్బాను రూ.32 వేలతో తయారు చేయించి వాహనానికి జత చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాన్‌కు సంబంధించిన సరకులు, సాయంత్రం చిరుతిళ్లు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద గంటకుపైగా విక్రయాలు చేస్తారు. తర్వాత మరో గ్రామం వెళ్తారు. నవీపేట మండలం జన్నేపల్లిలో తీసిన చిత్రమిది. – న్యూస్‌టుడే, నవీపేట

13 నుంచి కాజీపేట-దాదర్ రైలు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ఈ నెల 13వ తేదీ నుంచి కాజీపేట- దాదర్((07195/96) రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తొమ్మిది నెలల క్రితం అయోధ్య ప్రయాణికుల కోసం ఈ రైలును నడిపి రద్దు చేశారు. తాజాగా పునః ప్రారంభించినట్లు చెప్పారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల మీదుగా కాజీపేట నుంచి దాదర్ వెళ్లనుంది. రైలు సేవలు పునరుద్ధరించాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విన్నవించడంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రాజెక్టు నిండుగా.. రైతులకు పండుగ

● పంటల సాగుకు 59.172 టీఎంసీల విడుదల ● కొనసాగుతున్న వరద

న్యూస్‌టుడే, శ్రీరామసాగర్

శ్రీరామసాగర్ ప్రాజెక్టు.. జలకళను సంతరించుకొంది.. నిండుకుండలా మారింది.. ఎగువ నుంచి వరద చేరిక కొనసాగుతోంది. సెప్టెంబరు మొదటి వారంలోనే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. పరవళ్లు తొక్కుతూ వస్తున్న జలాలను గేట్ల ద్వారా నదిలోకి వదులుతుంది.. వానాకాలం పంటలకు వివిధ కాలువల ద్వారా సాగునీరు అందిస్తోంది.. వచ్చే యాసంగికి నేనున్నానని భరోసా కల్పిస్తోంది..

వానాకాలం పంటలకు ఆగస్టు 7వ తేదీ నుంచి నీటిని విడుదల చేశారు. వరుణుడు రైతుల ఆశలను వమ్ము చేయకుండా వారం రోజుల పాటు జోరుగా కరుణించడంతో జలాశయంలోకి సెప్టెంబరులో భారీగా వరద చేరింది. జూన్ 1వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు 238.347 టీఎంసీల నీరు చేరింది. పూర్తి స్థాయిలో 80.501టీఎంసీల నీటిని నిల్వ చేయగా మిగతా 165.247 టీఎంసీలను మిగులు జలాలుగా విడుదల చేశారు. గోదావరిలోకి 99 టీఎంసీలు వదిలారు. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతి, లక్ష్మి, వరద కాల్వతో పాటు ఎత్తిపోతల ద్వారా రైతుల పంటల సాగుకు 59.172 టీఎంసీలు పంపారు. మొత్తం 7.56 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నారు.



శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్న నీరు

కాల్వలు, ఎత్తిపోతలకు విడుదలైన నీరు (టీఎంసీలు)	కాకతీయ	వరద	సరస్వతి	లక్ష్మి	అలీసాగర్	గుత్ప	మిషన్ భగీరథ
	25.01	32.05	1.396	0.435	0.119	0.162	2.590

క్షేత్రస్థాయిలోనే పరీక్షలు చేయాలి


ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలు జ్వర బాధితులను గుర్తిస్తే వారి ఇంటి వద్దనే ఆర్డీటీ పరీక్ష నిర్వహించి వ్యాధి నిర్ధారించాలని జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు. డెంగీ కేసు నమోదైన పరిసరాల్లో 50 ఇళ్లలో జ్వర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. మండల వైద్యాధికారి సంతోష్ కుమార్, హెచ్‌ఈవో శంకర్, ఆరోగ్య పర్యవేక్షకుడు అక్బర్ అలీ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్

సంచి నుంచి రూ.లక్ష చోరీ

బాన్సువాడ, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ పాలకేంద్రం వద్ద ద్విచక్ర వాహనంలోని సంచి నుంచి రూ.లక్ష గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినట్లు బాన్సువాడ సీఐ అశోక్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సంగమేశ్వర కాలనీకి చెందిన సమీరొద్దీన్ ఓ బ్యాంకులో మంగళవారం రూ.లక్ష డ్రా చేశారు. డబ్బులు ద్విచక్ర వాహనంలోని సంచిలో పెట్టుకొని ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో పాల కేంద్రం వద్ద బండి నిలిపి పాలు కొనుగోలు చేశారు. తిరిగి వాహనం వద్దకు వచ్చి చూసే సరికి సంచిలోని రూ.లక్ష కనిపించలేదు. పరిసరాలు వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



లక్ష గాజులతో అలంకరణ

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని తూర్పు హౌసింగ్‌బోర్డు కాలనీలో శారదాంబ ఆలయంలో అమ్మవారు మంగళవారం కాత్యాయని దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేశారు. పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

స్వదేశీ మేళా ప్రతుల ఆవిష్కరణ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించే స్వదేశీ మేళా కార్యక్రమ కరపత్రాలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వదేశీ జాగరణమంచ్ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేళాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కేశవ్ సోని, రాజాగౌడ్, రాహుల్, యాలాద్రి, మనీశ్, భాజపా జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.



ప్రతులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, స్వదేశీ జాగరణమంచ్ ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పునకనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు భూపతి, శ్రవణ్, మహేష్, సదానంద్ తదితరులు ఉన్నారు.



సొసైటీ డైరెక్టర్ ఆత్మహత్య

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలం వెల్మల్ గ్రామానికి చెందిన గాదరి రాజలింగం (55) అలియాస్ లాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కొడుకు సతీశ్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. మంగళవారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందారు. రాజలింగం ప్రస్తుతం అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిన ఆయన తల్లి మానసికవేదనకు గురై శనివారమే మృతి చెందారు. రాజలింగం ఇటీవల నూతన గృహ నిర్మాణం చేపట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజలింగం

ఆడుతూ.. అనంతలోకాలకు

● ట్రాక్టర్ బోల్తాపడి బాలుడి దుర్మరణం




బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

లింగంపేట, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తా పడి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన లింగంపేట మండలం బోనాల్ పంచాయతీ పరిధిలోని బోనాల్ తండాలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బోనాల్‌తండాకు చెందిన రామావత్ భాస్కర్ తన ట్రాక్టర్‌ను ఇంటి సమీపంలోని రహదారిపై దిగుడు గల ప్రదేశంలో గేర్లు వేసి నిలిపి పనుల నిమిత్తం కామారెడ్డి వెళ్లారు. తన కుమారుడైన రమావత్ రిషికేష్(5) ట్రాక్టర్ పైకి ఎక్కి ఆడుతుండగా.. గేర్లు మార్చడంతో ఒక్కసారిగా వేగంగా ముందుకు కదిలి సమీపంలోని పంట పొలాల్లో ట్రాలీ బోల్తా పడింది. ఈ క్రమంలో బాలుడు అదుపుతప్పి పడిపోయాడు. తలకు, ముక్కుకు బలమైన గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. తండావాసులు గమనించి ట్రాక్టర్‌ను ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బాలుడి మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడి మరణ వార్త తెలిసి తల్లిదండ్రులు నిర్మల, భాస్కర్ రోదించిన తీరు స్థానికులను కలచివేసింది.



రిషికేష్

కేసీఆర్‌ని కలిసిన జిల్లా నేతలు



ఇందల్‌వాయి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఆయన నివాసంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ఆధ్యాత్మిక కవి సమ్మేళనం

బోర్గాం(పి)(మోపాల్) : బోర్గాం(పి)లోని లక్ష్మీగణపతి ఆలయంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆధ్యాత్మిక కవి సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కవులు గానం చేయగా.. వారిని సన్మానించారు. ఆలయ వ్యవస్థాపకుడు అరుణ్‌కుమార్‌శర్మ, డా.గణపతి అశోక్‌శర్మ, మురళి తదితరులుపాల్గొన్నారు.



బాల కవిని సన్మానిస్తున్న అరుణ్‌కుమార్‌శర్మ

ఈనాడు సినిమా

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: **దేవర పార్ట్-I** 12.55, 4.20, 7.20, 10.30(రాత్రి)
స్క్రీన్-2: **దేవర పార్ట్-I** 10.30
సత్యం సుందరం 1.40, 4.40, 7.30, 10.30(రాత్రి)
స్క్రీన్-3: **శ్వాగ్** 10.25, 1.30, 7.30, 10.30(రాత్రి)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (దేవమాల్)
స్క్రీన్-1: **దేవర పార్ట్-I** 11.15, 2.50, 6.25, 10.00(రాత్రి)
స్క్రీన్-2: **శ్వాగ్** 12.25, 7.00
జోకర్ ఫోలీ ఏ డెల్క్స్ (ఇంగ్లిష్) 3.45
సత్యం సుందరం 10.20 (రాత్రి)
స్క్రీన్-3: **జోకర్ ఫోలీ ఏ డెల్క్స్**(ఇంగ్లిష్) 12.35, 6.00, 9.15 (రాత్రి) **కిల్** 3.50
స్క్రీన్-4: **బహిర్భూమి** 11.05
మిస్టర్ సెలబ్రిటీ 1.45 **చిట్టి పొట్టి** 4.30
దక్షిణ 7.30 **రంగారి బన్నీ** 10.00(రాత్రి)
దేవి (ఎస్వీసీ): **శ్వాగ్** 11.15, 2.15, 6.15, 9.15(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): **సత్యం సుందరం** 11.00, 2.00, 6.00, 9.00(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): **దేవర పార్ట్-I** 10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): **సరిపోదా శనివారం** 11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

వృథాగా వసతిగృహ భవనం

న్యూస్‌టుడే, మోపాల్: గిరిజన కళాశాల అవరణలో గిరిజన బాలికల వసతిగృహం కొనసాగుతోంది. 2019లో రూ.1.30 కోట్లతో బాలికల కోసం బోర్గాం(పి)లో నూతన వసతిగృహాన్ని నిర్మించారు. కానీ తమకు దూరం అవుతుందని కళాశాలలో కొనసాగుతున్న వసతిగృహాన్ని బోర్గాం(పి)కి తరలించేందుకు విద్యార్థినులు అంగీకరించలేదు. దీంతో అందుబాటులో నూతన భవనం నిరుపయోగంగానే ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిటికీల అద్దాలు పగిలిపోయి, ప్రహరీ కూలిపోయింది. సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్తు పరికరాలు, నల్లాలు, బోరు మోటారు దెబ్బతిన్నాయి. భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి తాము ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని వృథాగా ఉంచకుండా ఇతర కార్యక్రమాలకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.



బోర్గాం(పి)లోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహం

అనుమతుల కోసం నిరీక్షణ

బోర్గాం(పి)లో నిర్మించిన వసతిగృహంలో విద్యార్థినులు ఉండటానికి ఆసక్తి చూపడంలేదు. దీంతో భవనాన్ని శిక్షణ కేంద్రానికి కేటాయిస్తూ అందుకు అనుమతులు, శిక్షకులు, పర్యవేక్షకుల కావాల్సిన నిధుల మంజూరుకు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నిరుద్యోగులకు వివిధ రకాల స్వయం ఉపాధి శిక్షణలు చేపడుతాం. ప్రస్తుతం వసతిగృహాన్ని గోదాంగా వినియోగిస్తున్నాం.

- గిరిజన సంక్షేమ శాఖాధికారి నాగారావు



బోధన్ ఆర్టీసీ డిపోలో..



హమాల్‌వాడి సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో..

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ



నగరపాలక సంస్థ కార్యాలయంలో..

న్యూస్‌టుడే బృందం : బతుకమ్మ సంబరాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మంగళవారం వేపకాయల బతుకమ్మగా పూజించారు. తీరొక్క పూలతో పేర్చి మహిళలు పాటలు పాడుతూ..ఆడారు. అందరికీ బంగారు బతుకునివ్వమ్మా అంటూ వేడుకున్నారు. అనంతరం స్థానిక జలవనరుల్లో నిమజ్జనం చేశారు.



నవీపేట: అమెరికాలో..



కిషన్‌గంజ్‌లో..

బకాయిలు చెల్లించాలని డిమాండ్

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే : బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా మహిళా కార్మికులకు బకాయిలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆశాలకు సెప్టెంబరు నెల పారితోషికాలు, లెప్రసీ సర్వే, పల్స్ పోలియోకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో రేణుక, సుకన్య, స్వప్న, లలిత, శోభ తదితరులు పాల్గొన్నారు.

13న ప్రతిభా పురస్కారాలు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆచార్య జయశంకర్ పేరుతో విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐలతో పాటు పోటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విశ్వ బ్రాహ్మణ విద్యార్థులకు ఈ నెల 13న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మనోహర ఆచార్య ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

ప్రశ్న: మాధవనగర్-బర్దీపూర్ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా రాత్రిపూట చీకటిగా ఉంటోంది. తాత్కాలిక వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- శ్రీనివాస్, నిజామాబాద్**

సమాధానం: ఆర్‌వోబీ వంతెన వద్ద తాత్కాలిక దీపాల ఏర్పాటు పరిశీలిస్తాం. **- ప్రవీణ్, డీఈ, ఆర్‌అండ్‌బీ, నిజామాబాద్**



జానకంపేట-నవీపేట ప్రధాన రహదారి వెంట చెత్తాచెదారం పేరుకుపోయిందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు.

సమస్య: నాందేవ్‌వాడ బ్రహ్మకుమారీ మందిరం పక్కన కొన్ని రోజుల నుంచి వీధి దీపం వెలగడం లేదు. రాత్రిపూట చీకటిగా ఉంటోంది. **- సంజీవ్ కుమార్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించి చర్యలు తీసుకుంటాం. **- సుభాష్, జోన్-I, ఏఈ, నగర పాలక సంస్థ**

– న్యూస్‌టుడే, ఎడపల్లి, నిజామాబాద్ అర్బన్



ఆర్యనగర్‌లో..



పోచమ్మగల్లీలో..



ముదిరాజ్‌గల్లీలో..



బోధన్ సరస్వతీనగర్‌లో..



రుద్రూర్‌లో..

దుర్గమ్మ.. కరుణించు తల్లీ



నవీపేట : మార్కండేయ ఆలయంలో దుర్గమ్మకు నగదుతో అలంకరణ

న్యూస్‌టుడే బృందం: కష్టాలను దూరం చేసి అందరిపై చల్లని చూపు చూడు దుర్గమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు కాత్యాయినీగా దర్శనమిచ్చింది. వివిధ ప్రాంతాల్లోని దేవాలయాలు, అమ్మవారి మండపాల్లో భక్తితో కొలిచారు. అమ్మవారికి చండీహోమాలు, సామూహికంగా కుంకుమార్చనలు, మంగళహారతులు సమర్పించారు. లలితాసహస్రనామ పారాయణాలు చేశారు. ఇందల్‌వాయిలోని దేవీ మండపం వద్ద మాలధారులకు పలువురు ముస్లింలు పండ్లు పంపిణీ చేశారు.



బోధన్ తట్టికోటలో...



గూపన్‌పల్లి అమ్మవారి ఆలయంలో మహాచండీ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సన్మానం



జిల్లాకేంద్రంలోని బ్యాంకు కాలనీలో..



ఇందల్‌వాయి : మాలధారులతో ముస్లింలు



కిషన్‌గంజ్ వాసవీమాత ఆలయంలో..



ధర్మారం(బీ)లో..



కోటగిరిలో..

అభివృద్ధి పనులకు భూమిపూజ

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని 36, 43 డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్ మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనరల్ ఫండ్ కింద నగరపాలక సంస్థ నుంచి ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, చిత్రంలో మేయర్

నాడు పచ్చదనం.. నేడు సంకటం

పచ్చదనం పెంపు కోసం ఏర్పాటు చేసిన ప్రకృతి వనం ప్రస్తుతం సంకటంగా మారింది. పురపాలక శాఖ గతంలో నిర్దేశించిన ప్రకృతి వనాలకు స్థలం లభించక అధికారులు బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు. వాటిలో త్వరగా పెరిగే కోనోకార్పస్ మొక్కలున్నాయి. తక్కువ కాలంలోనే ఎక్కువ ఎత్తుతో, గుబురుగా పెరిగాయి. ఇప్పుడు అవి కళాశాల భవనాన్నే కప్పేశాయి. పైగా ఈ మొక్కలు గుబురుగా ఉండటంతో ఆకతాయిల బెడద ఉంటోందనే వాదన ఉంది. మరోవైపు కోనోకార్పస్ మొక్కలతో నష్టంపై ఆందోళన నెలకొంది. ఈ మొక్కలను తొలగించాలని ఇటీవల కళాశాలకు వచ్చిన సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు విద్యార్థులు విన్నవించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



న్యూస్‌టుడే, బోధన్

వానొస్తే భవనం మారాల్సిందే

ఎడపల్లి మండల విద్యావనరుల కేంద్రం ప్రాంగణంలో 25ఏళ్ల కిందట అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం వర్షం పడితే చాలు భవనం ఉరుస్తోంది. వాన కురిసిన ప్రతిసారి కేంద్రంలోని గదులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. పిల్లలు కూర్చొని చదువుకునే, ఆడుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో స్థానికంగా రూ.కోటితో నిర్మించిన స్టేడియంలోకి కేంద్రాన్ని మార్చి అక్కడే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు విజయ రాణి వద్ద ప్రస్తావించగా.. భవనం మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. కిరాయి భవనం కోసం వెతికినా దొరకకపోవడంతో పంచాయతీ కార్యదర్శి అనుమతితో స్టేడియంలో కేంద్రాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఎడపల్లి



స్టేడియంలో కొనసాగుతున్న కేంద్రం

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

మోపాల్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేయని వారికి కూడా డబ్బులు చెల్లించిన విషయం సామాజిక తనిఖీల్లో వెలుగు చూసింది. మంగళవారం మోపాల్ రైతువేదిక ఆవరణలో డీఆర్‌డీవో సాయాగౌడ్ సమక్షంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో పనుల్లో చోటుచేసుకున్న విషయాలను తనిఖీ బృందం గ్రామాల వారీగా వెల్లడించింది. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలోని 21 గ్రామాల్లో రూ.3.37 కోట్లతో పనులు చేపట్టారు. పలు గ్రామాల్లో కూలీలకు డబ్బులు చెల్లించినట్లు చెబుతున్నా.. రికార్డుల్లో నమోదు చేయలేదు. పలు గ్రామాల క్షేత్ర సహాయకులు, గ్రామ కార్యదర్శులు, మేట్లపై రూ.20 వేల పెనాల్టీ, రూ.12 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్‌ఎంటీ(స్టేట్‌టీమ్ మానిటరింగ్) అధికారి అంజాద్ అలీ, ఎస్ఆర్పీ పాండురంగ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్



బోధన్ అంబేడ్కర్ చౌరస్తాలో..

భాజపా శ్రేణుల సంబరాలు

బోధన్, న్యూస్‌టుడే : హరియాణాలో భాజపా గెలుపుపై బోధన్‌లో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, బల్దియా ఫ్లోర్ లీడర్ వినోద్, నాయకులు ధర్మపురి, వెంకటేష్, సందీప్, వేణు, గంగాధర్, భూమేష్ పాల్గొన్నారు.

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై నిజామాబాద్ పార్టీ లీగల్‌సెల్ న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో భాజపా లీగల్ సెల్ న్యాయవాదులు టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. న్యాయవాదులు రవి, శ్రీకాంత్, నారాయణ, వసంత్‌రావు, శ్రీకాంత్, చిన్నానాయక్, తదితరులు ఉన్నారు.



మిఠాయిలు పంచుతున్న న్యాయవాదులు

అటవీ భూములు కాపాడండి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ నగరంలో కబ్జాకు గురైన అటవీ భూములు కాపాడాలని కాంగ్రెస్ నాయకుడు ఖైసర్ డిమాండ్ చేశారు. నగరంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. మౌజం కాలనీ, పెయింటర్ కాలనీ, మౌలానా అత్తర్ రహమాన్ కాలనీ, టీఎంఆర్ఈఐఎస్ స్కూల్ వద్ద అసద్‌బాబా నగర్ ప్రాంతాల్లో కొందరు ప్రజాప్రతినిధులు నిరుపేదల నుంచి డబ్బులు తీసుకుని గుడిసెలు వేయిస్తున్నారని ఆరోపించారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ మండలం కొప్పర్గకు చెందిన నగేష్(40) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగేష్ ఏ పనిచేయకుండా ఖాళీగా తిరుగుతూ మద్యానికి బానిసై ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతను సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయి శివారులో ఉన్న సొంత చేను సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నారు. మంగళవారం ఉదయం మృతుడి భార్య చేనుకు వెళ్లి చూడగా మృతిచెంది కనిపించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఏఎస్సై రవీందర్ తెలిపారు.

అతిగా మద్యం తాగి మృతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బోధన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ద్యాకంగల్లీకి చెందిన బాలయ్య (40) మత్స్యకారుడు. సోమవారం రాత్రి విందు చేసుకునేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి శివారులోని ఓ చోటకు వెళ్లి అక్కడ అందరూ మద్యం తాగారు. బాలయ్య అంతకుముందు కల్లు తాగి మళ్లీ అతిగా మద్యం తాగారు. భోజనం చేసేందుకు సమీపంలోని దాబా వద్దకు వెళ్లగా బాలయ్య అక్కడ స్పృహ తప్పి పడిపోయారు. దీంతో అతని స్నేహితులు దవాఖానాకు తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

క్రైమ్ కార్నర్



చెరువులో పడి రైతు..

వర్ని, న్యూస్‌టుడే: చెరువులో పడి రైతు మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ కథనం ప్రకారం.. చందూర్‌కు చెందిన రైతు శ్రీనివాస్ (38) పొలం మీదుగా చెరువు నీరు వెళ్తూ పంట ముంపునకు గురవుతుంది. దీంతో మంగళవారం రైతు చెరువులోని మూడు చింతల తూము వద్ద మట్టి తీయడానికి దిగారు. ప్రమాదవశాత్తు తూములో తట్టుకుని ఊపిరాడక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పొలంలో మృతదేహం లభ్యం

బోధన్ గ్రామీణం : బోధన్ శివారు పసుపువాగు సమీపంలోని వరి పొలం ఒడ్డున ఓ వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మోస్రా మండలం గోవూర్‌కు చెందిన పోచయ్య(55)గా పోలీసులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. అతను మూడు రోజుల కిందట వర్నికి ఆటోలో వెళ్తూ కాలకృత్యాల కోసం పొలం వద్దకు వెళ్లగా అక్కడ మూర్ఛ వచ్చి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

20 వాహనాల జప్తు

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లిలో నిజామాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై మంగళవారం స్థానిక పోలీసులు, బోధన్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని 20 ద్విచక్ర వాహనాలను జప్తు చేసి ఠాణాకు తరలించారు. బోధన్ రూరల్ సీఐ విజయ్, ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ పోలీసు అధికారి చందర్ రాథోడ్ పాల్గొన్నారు.

రెండు రోజుల జైలు శిక్ష

నిజామాబాద్ నేరవిభాగం : మూడో ఠాణా పరిధిలో మద్యం మత్తులో డయల్ 100కు కాల్ చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. గౌతమ్‌నగర్‌కు చెందిన రాజేశ్ సోమవారం డయల్ 100 కాల్ చేసి గందరగోళం సృష్టించాడు. మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టు ఎదుట హాజరుపరచగా శిక్ష విధించారు.

బస్సును ఢీకొన్న కారు

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: రూరల్ ఠాణా పరిధి గంగాస్థాన్ ఫేస్-2 సమీపంలో ఓ కారు ఆర్టీసీ బస్సును ఢీకొట్టిందని ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు. కారు గంగాస్థాన్ ఫేస్-2 నుంచి ప్రధాన రహదారిపైకి వస్తున్న క్రమంలో నగరం నుంచి నందిపేట్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా.. ఎవరికి గాయాలు కాలేదు. ఫిర్యాదు అందలేదన్నారు.

జూదరుల అరెస్ట్

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో జూద స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నలుగురిని పట్టుకొని వారి నుంచి రూ.4 వేలు, మూడు చరవాణులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

'తెలంగాణలో గెలుపు ఖాయం'

నిజామాబాద్ నగరం : తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో హరియాణా ఫలితాలు పునరావృతం అవుతాయని, భాజపా గెలుపు ఖాయమని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి మంగళవారం ప్రకటనలో తెలిపారు.

22 మంది గైర్హాజరు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ హిందీ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్, సమన్వయకర్త రవీందర్ ప్రకటనలో తెలిపారు.

ప్రచార పత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ నగరం : హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే స్వదేశీ మేళా ప్రచార పత్రాలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్ర సంఘటనా మంత్రి శ్రీనివాస్, కేశవ్‌సోని, రెంజర్ల నరేష్, రాహుల్, రోషన్, నవీన్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఇందూర్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం పింఛనర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతినిధులు హన్మాండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు వీరయ్య పాల్గొన్నారు.

ధర్పల్లికి విద్యుత్తు ఉప కేంద్రం మంజూరు

ధర్పల్లి, న్యూస్‌టుడే: ధర్పల్లిలో విద్యుత్తు సమస్య పరిష్కరించడానికి ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి 133 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాన్ని మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ తెలిపారు. మంగళవారం ధర్పల్లి విద్యుత్తు ఉపకేంద్రం వద్ద పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం ఉపకేంద్రంలోని నియంత్రికలు దెబ్బతిని గ్రామంలో సరఫరా నిలిచినందుకు భాజపా నాయకులు ఆందోళన చేయడం సరికాదన్నారు. భారాస హయాంలోనే ఈ సమస్య ఉంటే అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నాయకులు చెలిమెల నర్సయ్య, హమీద్, శ్రీనివాస్, సుభాష్, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ఆర్మూర్
● ఆర్మూర్ ● బాల్కొండ

నేడు బతుకమ్మ వేడుకలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ బల్దియా ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలు నిర్వహించే జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ బల్దియా పరిధిలో పది శాతం భూములు ఆక్రమణలకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నరసింహారెడ్డి పురపాలక సంఘాన్ని సందర్శించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనుమతుల విషయంలో నియమనిబంధనలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ సుమన్, ఆర్మూర్ బల్దియా టీపీవో అంజనేయులు, టీపీఎస్ ప్రవీణ, మేనేజర్ హయ్యూం, ప్రభాకర్ ఉన్నారు.



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్-1 **బఘీర్భూమి:** 10.50, **మిస్టర్ సెలెబ్రిటీ:** 1.30, **చిట్టి పొట్టి:** 4.15, **జోకర్ ఫోలీ ఎ డెక్స్:** 10.30, **సత్యం సుందరం:** 10.30

స్క్రీన్-2 **దేవర:** 11.00, 2.35, 6.10, 9.45

స్క్రీన్-3 **కలి:** 11.05
జోకర్ ఫోలీ ఎ డెక్స్: 1.15, **దక్షిణ:** 4.30
దేవర: 7.00, **రామ్‌నగర్ బన్నీ:** 10.35

స్క్రీన్ 4 **స్వాగ్ :** 12.00, 3.20, 6.40, 10.00

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో చోటు

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ మండలానికి చెందిన పలువురికి పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షులుగా సచ్చిదానంద్, కృష్ణారావు, శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ మురళి, సుజాత, ఆశారాణి, కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు. వారిని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గడ్డం నగేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆర్మూర్ పట్టణం: నేటి యువతరం మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసీకుమార్ అన్నారు. స్వాతంత్ర్య అంశాల సేకరణతో రూపొందించిన పుస్తకాన్ని మంగళవారం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డికి ఆయన బహూకరించారు.

పల్లెలు.. సంప్రదాయ మల్లెలు!

● అమ్మవారి సేవలో భక్తుల తన్మయత్వం
● ఆడబిడ్డల రాకతో సందడి





పల్లెలు.. దసరా శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయ మల్లెలుగా మారాయి.. ఆడబిడ్డలు, బంధువుల రాకతో కళకళలాడుతున్నాయి. చిన్నారుల ఆటలతో మురిసిపోతున్నాయి. బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తుతున్నాయి.. శరన్నవరాత్రి ఉత్సవాలతో ఉప్పొంగిపోతున్నాయి.. భజనలు, సంకీర్తనలు, కుంకుమపూజలు కనిపిస్తున్నాయి. పట్టణాలన్నీ పల్లె బాట పడుతున్నాయి.. దసరా వేడుకలతో ఊరూ-వాడ శోభాయమానం కనిపిస్తోంది. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో సుమారు 350 మండపాలున్నాయి.

–న్యూస్‌టుడే, ఆర్మూర్

హోమాలు.. భజనలు.. సంకీర్తనలు.



ఏ మండపం వద్ద చూసినా సంప్రదాయబద్ధంగానే పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా సనాతనంగా వస్తున్న భజనలు, కీర్తనలు, పాటలు, పద్యాలు పాడి భక్తులు తమ భక్తిని చాటుతున్నారు. ఇంకొన్ని చోట్ల సంస్థల ప్రస్తారాలతో కోలాటాలు, నృత్యాలు చేస్తూ తన్మయం పొందుతున్నారు. హోమాలు నిర్వహిస్తున్నారు. మంగళహారతులు చేత పట్టి అమ్మవారి దర్శనంలో భాగస్వామ్యులవుతారు. అక్కడ పూజారులు దేవి దీరగాధలను కథల రూపంలో చెబుతుంటే విని తన్మయం పొందుతారు.

పండుగ వాతావరణం

తెలంగాణలో దసరాకు ఉండే ప్రాధాన్యం అంతాఇంతా కాదు. పట్టణాలు, నగరాల్లో ఉండే వారు తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలంతా తమ అమ్మమ్మ ఇళ్లకు వచ్చారు. బతుకమ్మ కోసం ఆడబిడ్డలు రావడంతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. అందరూ కలిసి చేసే సందడితో ఊరంతా పండగ వాతావరణం నెలకొంది.

అమ్మగా ఆశీర్వదించమని..

స్వరూపిణిగా దుర్గాదేవిని కొలుస్తున్నారు. తొమ్మిది రోజులపాటు ఒక్కో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అన్నపూర్ణ, శాకంబరిగా ఇలా రోజుకోరకంగా కొలిచి ఆమెకు ఒడిబియ్యం పోసి, నైవేద్యాలు, ప్రసాదాలు, చీర, గాజులు సమర్పించి మొక్కులు చెల్లిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

పిండివంటలతో ఘుమఘుమలు



గ్రామాలన్నీ పిండివంటలతో ఘుమఘుమలాడుతున్నాయి.. మహిళలంతా ఒక చోటకు చేరి కారపూస, అరిసెలు, కారబూలు తదితర తయారు చేసుకుంటున్నారు. ఏ గుమ్మం చూసినా నోరూరించే సువాసనలతో ఆహ్వానిస్తున్నాయి.

పాడి పంటలతో విరిసిల్లి..

ఇప్పుడిప్పుడే పల్లెల్లో పండిన పంటలన్నీ ఇంటికి చేరుకుంటున్నాయి. ఆరుగాలం కష్టించిన పంట రాబడి రూపంలో చేరుతుండడంతో అన్నదాతల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. రాబడి సొమ్ము చేతికందుతోంది. దీంతో కొత్త బట్టలు, ఇంటి సామగ్రి తెప్పుకుంటున్నారు.


నందిపేటలోని నందివాడలో..

బతుకమ్మ ఆటల పాటలు

పల్లెలన్నీ బతుకమ్మ ఆడుతున్నాయి.. ఎక్కడెక్కడో ఉంటున్న యువతులు, మహిళలు సొంతూళ్లకు వచ్చారు. నిత్యం తీరొక్క పూలు తీసుకొస్తున్నారు. ఇళ్లలో బతుకమ్మలు పేర్చుతున్నారు. సాయంత్రం పట్టుచీరలు కట్టుకొని ఆయా గ్రామాల్లో దేవాలయాల వద్దకు వెళ్తున్నారు. అందరూ కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆడుతున్నారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

మండపాలు.. తీరొక్క పూజలు


శివాజీ యూత్ ఆధ్వర్యంలో..


తిరుమల కాలనీలో..
కమ్మర్‌పల్లిలో..




ఆర్మూర్ క్రైట్స్ యూత్..

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణ వ్యాప్తంగా ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. కుంకుమార్చనలు, చండీ హోమాలు నిర్వహించారు. మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. పట్టణ వ్యాప్తంగా దుర్గామాత మండపాలు ఆకట్టుకున్నాయి.

భీమ్‌గల్: బడాభీమ్‌గల్ గ్రామ యువచైతన్య యువజన సంఘం, దుర్గాభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి మండపంలో ఆరో రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ. 1.50లక్షలతో అలంకరించి పూజించారు.

నందిపేట్ గ్రామీణం: నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపాన్ని రూ. 14 లక్షలతో అలంకరించారు. మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


ఆర్మూర్‌లో


అమ్మవారిని నగదుతో అలంకరించారిలా..


కోటార్మూర్‌లో రూ. 21 లక్షలతో..


బడాభీమ్‌గల్‌లో రూ.1.50 లక్షలతో..


ఆర్మూర్ సర్వసమాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి రూపాలు


అయిలాపూర్‌లో రూ. 14 లక్షలతో..

గేట్లెత్తి.. జలాలు వదిలి!



శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 34,086 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తి స్థాయిలో నీటినిల్వ ఉన్నందున వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు వరద గేట్లను ఎత్తి గోదావరి నదిలోకి 12,496 క్యూసెక్కులు నదిలోకి వదిలారు. ప్రస్తుతం 80.501 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. –న్యూస్‌టుడే, శ్రీరామసాగర్

ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ..

పోచంపాడ్(బాల్కొండ), న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఉద్యోగినులు బతుకమ్మలు పేర్చారు. ఉత్పత్తి కేంద్రం ముందు పాడుతూ ఆడారు. కాల్వలో నిమజ్జనం చేశారు.


పోచంపాడ్ జల విద్యుదుత్పాదన కేంద్రంలో..

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలకేంద్రంతోపాటు వెల్మల్, తల్వేద, చింరాజ్‌పల్లి, కంఠం, అయిలాపూర్, లక్కంపల్లి, బాద్గుణ, ఉమ్మెడ గ్రామాల్లో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

ఆర్మూర్ గ్రామీణం: దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పెట్టి భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ ఆడారు. ఆయుష్ మెడికల్ అధికారిణి డాక్టర్ నీలిమ, పీహెచ్ఎన్ వల్లి, ఆరోగ్య పర్యవేక్షకురాలు అజీమా, నలిని, ఆరోగ్యకార్యకర్త స్వప్న, రాజగంగు, ప్రసన్న, గిరిజ, జము, శ్రీవేణి, బీరవ్వ, హేమజ, పద్మలత, సుజాత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


దేగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో..

అవ్వకు బువ్వ

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవ్వకు బువ్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 54 మంది పేదలకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రవీణ్, నరహరి, గోపికృష్ణ, శ్రీధర్, గంగాధర్, సత్యం, తులసీకుమార్, సాయినాథ్, శ్రావణ్ ఉన్నారు.

అటవీ భూములు కాపాడండి

నిజామాబాద్ నేరవిభాగం: నిజామాబాద్‌లో కబ్జాకు గురైన అటవీ భూములు కాపాడాలని కాంగ్రెస్ నాయకుడు ఖైసర్ డిమాండ్ చేశారు. డీఎఫ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు

దిగుబడి కోసం శిక్షణ

తిమ్మాపూర్(మోర్తాడ్): ఆయిల్ పామ్ సాగులో 'ఎలాబోడోబిస్ కామెరనికస్' కీటక వల్ల సంపర్కం జరిగి దిగుబడులు వస్తాయని ఉద్యాన అధికారి రాజాగౌడ్ పేర్కొన్నారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్‌లో ఆయిల్ పామ్ సాగును ఉద్యాన అధికారులు మంగళవారం సందర్శించారు. సాగులో రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

నేడు చెక్కుల పంపిణీ

బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారని భారాస బాల్కొండ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, బాల్కొండ అధ్యక్షుడు సాగర్ యాదవ్ తెలిపారు. ఉదయం పది గంటలకు వేల్పూర్ రైతు వేదికలో, మధ్యాహ్నం 12 గంటలకు బాల్కొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, 3 గంటలకు కమ్మర్‌పల్లి రైతు వేదికలో, సాయంత్రం 5 గంటలకు మోర్తాడ్ రైతు వేదికలో జరిగే కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

ఇంటింటా జ్వర సర్వే


నిల్వనీటిని తొలగిస్తున్న అధికారులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జ్వర సర్వే చేపట్టారు. డ్రై డేను నిర్వహించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, రాజవ్వ, మమత, సాగర్, నరేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఓ పెంకుటిల్లు ఆకస్మాత్తుగా కూలిపోయింది. అందులోనే నివాసం ఉంటున్న మహిళ కొండపల్లి గంగు, ఆమె మనుమడు మహేష్‌కు గాయాలయ్యాయి. మంగళవారం 'మా ఊరు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వారిని పరామర్శించి రూ. 3,500 ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ రూ. 3 వేలు అందించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్ పునరావాసం కోసం రేకులు వితరణగా ఇచ్చారు. రాంచందర్, డాక్టర్ అరుణ్, దుగ్గి లక్ష్మణ్, గాండ్ల రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్‌లోని హమాస్ దాడిలో మృతి చెందిన పౌరులకు ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ అక్కడి ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక నిమిషం మౌనం పాటించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సోమ రవి, ఉపాధ్యక్షులు కటకం రాజేష్, ప్రధాన కార్యదర్శి వివేక్ ముంబాయి, మెదక్ యాదగిరి, రాజేష్, మల్లెల గంగాధర్, రమేష్‌రెడ్డి, కేడి రవి, శ్రీనివాస్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నగదు అందజేత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లికి చెందిన ప్రవాస భారతీయుడు గుగ్గిళ్ల దేవరాజ్ రూ. 4.50 లక్షలను పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి వితరణ చేశారు. నగదు ద్వారా వచ్చిన వడ్డీ డబ్బులు రూ 74,243లను రూ. 5711 చొప్పున 13 మంది కార్మికులకు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామస్వామి మంగళవారం పంపిణీ చేశారు. కోశాధికారి బుచ్చిమల్లయ్య, సున్నం ధర్మయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అశోక్


అశోక్‌గౌడ్

చిట్టాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: చిట్టాపూర్‌కు చెందిన అబ్బగోని అశోక్‌గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అందజేశారు.

జూదరుల అరెస్టు

నిజామాబాద్ గ్రామీణం: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో జూద స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నలుగురిని పట్టుకొని వారి నుంచి రూ. 4 వేలు, మూడు చరవాణులు స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

విజేతలకు బహుమతుల అందజేత

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్విస్‌లీగ్ చెస్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు పాఠశాల వ్యవస్థాపకులు షఫీ, తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు సుర్జిల్, నిర్వాహకులు ఇదాప్ ప్రణీత్, రాజు, రాజేందర్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి నిజామాబాద్‌కు చెందిన మోహన్ రూ. ఐదువేలు, రాజాగౌడ్‌కు రూ రెండు వేలు అందజేశారు.


భీమ్‌గల్‌లో టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న షఫీ

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ పట్టణంలోని నందిగల్లీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తోపారం నిశ్వంత్(7) మృతి చెందాడు. భీమ్‌గల్ ఎస్సై జి.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నిశ్వంత్ నందిగల్లీలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయపడి కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తల్లి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ అఫ్రోజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని పశువుల కాపరి..

సోన్, న్యూస్‌టుడే: పశువులను మేపుతున్న మహిళ వాటిని రోడ్డు దాటిస్తున్న క్రమంలో కారు ఢీకొని మృతిచెందిన ఘటన మంగళవారం నిర్మల్ జిల్లా సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. సోన్ ఏఎస్సై భీమేశ్వర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా మండలం వెల్కటూరు గ్రామ వాసి హనుమవ్వ(48) గంజాల్ గ్రామానికి పశువుల కాపరిగా వచ్చారు. గ్రామ శివారులో రోజూ పశువులను మేపుతున్నారు. మంగళవారం ఉదయం పశువులను మేతకు తోలుకెళ్లి టోల్‌ప్లాజా సమీపంలో వాటిని రహదారి దాటిస్తుండగా ఓ కారు ఆమెను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


హనుమవ్వ

పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త, దాత ఏనుగు దయానంద్‌రెడ్డి మంగళవారం రూ. 97 వేల విలువైన 25 డెస్క్ బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్వజన సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సర్వజన సభ్యులు వెంకటరాములు, రమేష్, గణేష్, ఎర్రయ్య, రాజు, ఉదయ్, సాగర్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, జహీర్ సయ్యద్, ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం

ముప్కాల్, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని చైతన్య యువజన సంఘం మైదానంలో ఇండోర్ స్టేడియంలో ఐదు రోజులుగా జరుగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. జూనియర్ స్థాయి అండర్ 55 కేజీల విభాగంలో ఈ శిక్షణ కొనసాగినట్లు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య తెలిపారు. కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కబడ్డీ గంగాధర్, పీడీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతే గంగారెడ్డి, టి.సాయన్న, గోపిరామ్, కంచు నరేష్ పాల్గొన్నారు.


శిక్షకులతో క్రీడాప్రతినిధులు